జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి-కడప అర్బన్

జాబ్ మేళాకు ఎంపికైన విద్యార్థులు

ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం హెటేరో లాబ్స్ లిమిటెడ్ వారు నిర్వహించిన జాబ్ డ్రైవ్‌కు విద్యార్థుల నుంచి స్పందన లభించింది. ఈ ఎంపికలకు కడప నోడల్ రిసోర్స్ సెంటర్‌కు సంబంధించిన కడప ప్రభుత్వ పురుషుల కళాశాల, వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు 26 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాత పరీక్ష, మౌఖిక పరీక్ష నిర్వహించి 16 మంది విద్యార్థులను జూనియర్ కెమిస్ట్ ఉద్యోగానికి ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్, జెకెసి కో-ఆర్డినేటర్ సిహెచ్.రాము, జెకెసి మెంటార్లు ఎన్.సారధి, సి.వి.రవీంద్రారెడ్డి, హెచ్ఆర్ పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించారు.

కొప్పర్తికి మహర్దశ

- రూ.8,860 కోట్లతో పారిశ్రామిక హబ్
- 2,596 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటు
- రూ.2,137 కోట్లతో ప్రాజెక్టు వ్యయం
- 54,500 మందికి ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కొప్పర్తి పారిశ్రామికవాడకు మహర్దశ పట్టనుంది. బుధవారం కేంద్ర కేబినెట్‌లో కొప్పర్తి పారిశ్రామికవాడ పారిశ్రామిక హబ్‌గా మార్పు చెందడానికి ఆమోదం లభించినట్లు కేంద్ర మంత్రి అశ్వనీవైష్ణవ్ పేర్కొన్నారు. దేశంలోని 234 కొత్త పట్టణాలను ఎఫ్ఎం ఛానల్స్ కలిగిన నగరాలుగా అభివృద్ధి పరచనున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, మదనపల్లి పట్టణాల్లో మూడు ఛానళ్ల చొప్పున గుర్తింపు లభించింది. ప్రధానంగా కొప్పర్తి పారిశ్రామికవాడకు స్థానం లభించింది. కొప్పర్తి పారిశ్రామికీకరణకు అవసరమైన పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. స్థానిక ఉత్పత్తులకు గల అవకాశాల ఆధారంగా ఎటువంటి సెక్టార్లు అభివృద్ధి చెందడానికి గల అవకాశాలు ఉన్నాయనే కోణాలను స్పృశించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొప్పర్తిలో వైఎస్ఆర్ పారిశ్రామికహబ్ పేరిట కార్యకలాపాలు సాగిస్తోంది. ఆల్ డిక్సన్ కంపెనీ మూడు షిఫ్టుల ప్రకారం రెండు వేల మందికి ఉపాధి కల్పిస్తూ ఎలక్ట్రానిక్ గూడ్స్ ఉత్పత్తి కార్యకలాపాలను వేగవంతం చేసింది. పలు ఎంఎస్ఎంఇలు కార్యకలాపాలను సాగిస్తుండడం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి పారిశ్రామికవాడలో రూ.8,860 కోట్లతో పారి శ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడానికి ముందుకు రావడం నిరుద్యోగ లోకానికి ఉపశమనం కలిగిస్తోంది. 2,596 ఎకరాలను పారిశ్రామికాభివృద్ధికి కేటాయించనున్నారు. రూ.2,137 కోట్లతో కూడిన ప్రాజెక్టు వ్యయాన్ని కేటాయించనున్నట్లు ప్రకటించారు. 54,500 మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా రిన్యూవబుల్స్, ఆటో మొబైల్స్ విడిభాగాలు, నాన్ మెటాలిక్ మినరల్స్, టెక్స్‌టైల్స్, కెమి కల్స్, ఇంజినీరింగ్ విడిభాగాలు, మెటాలిక్ వస్తువులను ఉత్పత్తి చేయడానికి గల అవకాశాలను పరిశీలించారు. కొప్పర్తి పారిశ్రామి కాభివృద్ధి రాయలసీమ ఆర్థికాభివృద్ధికి చోదకశక్తిగా మారుతుందని భావించారు. కొప్పర్తి పారిశ్రామికవాడ

కొప్పర్తి పారిశ్రామిక వాడ

అభివృద్ధి చెందడానికి అనువైన రీతిలో మౌలిక సదుపాయాలైన స్టేట్ హైవే, నేషనల్ హైవే, రైల్వే, ఎయిర్, పోర్టు కనెక్టివిటీ అంశాలను ప్రస్తావించారు. ఇందులో ప్రధానంగా 250 కిలోమీటర్ల పరిధిలో చెన్నయ్, బెంగళూరు నగరాలు ఉండడంతో కలిసి రానున్నట్లు గుర్తించారు. కొప్పర్తి పారిశ్రామికవాడకు ఎస్‌హెచ్-51 కడప-పులివెందుల రహదారి, ఐదు కిలోమీటర్ల సమీపంలో ఎన్‌హెచ్-40 కర్నూలు-రాణిపేట నేషనల్ హైవే, ఎనిమిది కిలోమీటర్ల సమీపంలో ఎన్‌హెచ్-716 నెంబరు గల కడప-చెన్నయ్ నేషనల్‌హైవే, ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో ఎన్‌హెచ్ 544ఎఫ్ అనంతపురం-విజయవాడ నేషనల్ హైవేలు అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. మరో తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో కృష్ణాపురం, 13 కిలోమీటర్ల పరిధిలో కడప రైల్వే జంక్షన్, 11 కిలోమీటర్ల పరిధిలో కడప ఎయిర్‌పోర్టు, 150 కిలోమీ టర్ల సమీపంలో తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, 200 కిలోమీటర్ల పరిధిలో కృష్ణపట్నం పోర్టు, 270 కిలోమీటర్ల సమీపంలో చెన్నయ్‌పోర్టు, 196 కిలోమీటర్ల పరిధిలో కొప్పర్తి రైల్‌కార్గో ఇంట ర్నేషనల్, 157 కిలోమీటర్ల పరిధిలో అనంతపురం ఎంఎంఎల్‌పి వంటి సదుపాయాలు అందుబాటులో ఉండడం కలిసి రానున్నట్లు ప్రకటించింది. కొప్పర్తికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించడంతో పారిశ్రామికవాడ పారిశ్రామిక హబ్‌గా మారడానికి వడివడిగా ముందుకు సాగడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పవచ్చు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పటిష్టం చేయాలి

- కలెక్టర్ లోతేటి శివశంకర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎంఎస్ఎంఇ 1989 యాక్ట్ నిబంధనల మేరకు జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పటిష్టం చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ చీఫ్ కృష్ణమూర్తితోకలిసి కలెక్టర్ జిల్లా పరిశ్రమల భద్రతా కమిటీ, జిల్లా విపత్తుల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని అన్ని పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కల్పించేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి కమిటీలో పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వ యంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రత చర్యలను పర్యవే క్షించాల్సిన అవసరం ఉందన్నారు. రెడ్ కేటగిరీలో ఉన్న పరిశ్రమల్లో తగిన రక్షణ, భద్రత కల్పించేందుకు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోటోకాల్ చర్యలను ఖచ్చితంగా పాటించాలన్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండల పరిధిలోని ఓ పరిశ్రమలో తాజాగా జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని పరిశ్రమల్లో భద్రతా చర్యలు మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లాలో 1092 రిజిస్టర్డ్ ఫ్యాకరీలు నడుస్తున్నాయని, అందులో దాదాపు 33,206 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారందరికి విధి నిర్వహణలో భద్రత కల్పించే దృష్ట్యా అన్ని ఫ్యాక్టరీలలో భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హానికర పదార్థాల ఉత్పతులు, వినియోగం జరిగే పరిశ్రమలను వాటి తీవ్రతను బట్టి కేటగిరీలుగా విభజించి వాటిలో తరచూ భద్రతా చర్యలు తనిఖీలు నిర్వహించేలా జిల్లాలో ప్రధానంగా ఏమర్జెన్సీ బేస్డ్ రెస్క్యు సర్వీసెస్ అవసరమైనన 28 ఫ్యాక్టరీలను గుర్తించామన్నారు. ఎంఎస్ఎంఇ యాక్ట్ ప్రకారం ఫ్యాక్టరీల్లో చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని, క్రైసిస్ గ్రూప్ సభ్యులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒక చిన్న మానవ తప్పిదం వల్ల కార్మికుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం రాకూడదని హెచ్చరించారు. ప్రతి 45 రోజులకు ఒకసారి భద్రతా చర్యల అమలుపై తనిఖీలు నిర్వహించాలన్నారు. మెటీరియల్ సేఫ్టీ డేటా షీట్ నిర్వహణపై ఆపద మిత్రలు పరిశ్రమల పరిసరాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రెవెన్యూ, ఫైర్ శాఖల అధికారులు సమన్వయంతో తరచుగా మాక్ డ్రిల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ కార్మికుల్లో, ప్రజల్లో ఫ్యాక్టరీలలో ప్రమాదాల నివారణ, ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన అత్యవసర చర్యలపై అవగాహన పెంపొందించాలన్నారు. ముందుగా రెడ్ కేటగిరీ పరిశ్రమల్లో తనిఖీలను చేయాలని, ప్రమాదాల నివారణకు ప్రోటోకాల్ ప్రకారం ఏఏ భద్రతా చర్యలు తీసుకోవాలో చెక్ లిస్ట్ తయారు చేసి, అన్ని పరిశ్రమల యాజమాన్యాలకు పంపాలని జిల్లా ఫ్యాక్టరీస్ పర్యవేక్షకులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ముందుగా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ చీఫ్ కృష్ణమూర్తి జిల్లాలోని వివిధ కేటగిరీలకు చెందిన పరిశ్రమల్లో హైరిస్క్, మీడియం రిస్క్, లోరిస్క్ ఫ్యాకరీలలో అమలవుతున్న ఆన్ సైట్, ఇన్ సైట్ సేఫ్టీ మెజర్స్ గురించి క్షుణ్ణంగా వివరించారు. సమావేశంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు వెంకటపతి, శ్రీనివాసులు, చంద్రమోహన్, వెంకటేశ్వర్లు, పరిశ్రమల శాఖ డిప్యూటీ జెడ్ఎం ఉదయ్ కుమార్, జిఎం జయలక్ష్మి, డిటిసి మీరా ప్రసాద్, అగ్నిమాపక, విపత్తుల స్పందన శాఖ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీకాంత్ నాయక్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, విద్యుత్ శాఖల అధికారులు, జిల్లాలోని పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంచుతాం : ఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్

పోలీస్ శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై విస్తృతంగా తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేయాలన్నారు. ఇటీవలి కాలంలో బహిరంగ మద్య పానంపై నిఘాతో నేరాల శాతం బాగా తగ్గడంతో పాటు ప్రజల నుంచి డయల్ 100కు వచ్చే ఫిర్యాదులలో గణనీయమైన తగ్గుదల నమోదయిందని పేర్కొన్నారు. సమాజంలో నేరాల శాతం తగ్గినపుడు ప్రజలు తాము సురక్షితంగా ఉన్నామనే భావన కలుగుతుందన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి ఆయా ప్రాంతాలలోని

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

ప్రజల నుంచి సమాచారం తీసుకుని దాడులు నిర్వహించాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి అత్యధిక ప్రాధాన్యతతో ఆచూకీ కనుగొని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి జి.వెంకట రాముడు, జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి-కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్-23 మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగు తున్నాయి. బుధవారం చిత్తూరు, నెల్లూరు జట్ల మ్యాచ్ ప్రారంభమైంది.

తలపడుతున్న నెల్లూరు, చిత్తూరు జట్లు

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.0 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సోహన్ వర్మ 92 నాటౌట్, మాధవ్ 54 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని రెడ్డిప్రకాష్ 3, అచ్యుతానంద 2, షేక్ జావీద్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 22 పరుగులు చేసింది. **182 పరుగులకే కుప్పకూలిన కర్నూలు జట్టు :** కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 182 పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 55.2 ఓవర్లలో 182 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మహేంద్ర యాదవ్ 47, సాయి కృష్ణసింగ్ 42 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని మల్లికార్జున అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. దీపక్ 2, లోహిత్ సాయి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ కుదిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 32.0 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. ఆ జట్టులోని రోహిత్ రోషన్ 74, యోగానంద 52 పరుగులు చేశారు.

స్మార్ట్ మీటర్లు రద్దుకు మరో విద్యుత్ పోరాటం

- విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభలో వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

స్మార్ట్ మీటర్లు రద్దు చేయకపోతే మరో విద్యుత్ పోరాటానికి శ్రీకారం చుట్టాల్సి వస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ నగర కార్య దర్శి వెంకటశివ హెచ్చరించారు. వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభలో ఆనాటి బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ 2000 సంవత్సరం ఆగస్టు 28న ఆనాటి పాలకులు ప్రపంచ బ్యాంకు షరతులో భాగంగా విద్యుత్ ఛార్జీల పెంపుకు పూనుకున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం వామపక్షాలు, కాంగ్రెస్ శ్రేణులు కలిసి పెద్ద ఎత్తున పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ఉద్యమం నిర్వహించారని తెలిపారు. ఆ ఉద్యమంలో భాగంగా చలో హైదరాబాద్‌కు పిలుపు ఇచ్చిన సందర్భంలో బషీర్‌బాగ్ కాల్పుల ఘటనలో వామపక్ష పార్టీల నాయకులు రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామిపై అప్పటి ప్రభుత్వం కర్కశంగా కాల్పులు జరిపించిందని విమర్శించారు. ఆ ఘటనలో ముగ్గురు అమరులయ్యారని పేర్కొన్నారు. అప్పటి నుంచి విద్యుత్ ఛార్జీలు పెంచాలంటే పాలక ప్రభుత్వాలు భయపడేవని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాదేశాలకు లొంగి రాష్ట్రంలోని నివాస గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టాలని గత వైసిపి ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. అదే విధానాన్ని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అమలుకు సిద్ధపడడం సరికాదన్నారు. అదానీ, షిర్డీసాయి తదితర కంపెనీలకు కాంట్రాక్టులను కట్టబెట్టడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకున్నదని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉండగా ఈ మీటర్లను వ్యతిరేకించిందని తెలిపారు. హైకోర్టులో పిటీషన్లు వేశారని చెప్పారు. నేడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగిసించడానికి నిర్ణయించు కోవడం ఏమిటని ప్రశ్నించారు.

విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. తదుపరి వ్యవసాయ పంపు సెట్లకు, నివాస గృహాలకు మీటర్లు బిగించే ప్రక్రియకు సిద్ధమవుతున్నారని చెప్పారు. మొదటి దశలో వ్యవసాయం పంపు సెట్లకు మీటర్ల పేరుతో క్రమంగా ఉచిత విద్యుత్తుకు ఎసరుపెట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నివాస గృహాలకు మీటర్లతో ప్రీపెయిడ్ పద్ధతి, విద్యుత్ వాడే సమయాన్నిబట్టి అదనపు ఛార్జీలు, మీటర్ల ఖర్చును వినియోగదారులపై వేయటం తదితర రూపాల్లో భారం పడుతుందన్నారు. రూ.వేల కోట్ల ప్రజాధనం మీటర్ల పేరుతో దుర్వినియోగమవుతుందని పేర్కొన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మాట తప్పి కేంద్ర ప్రభుత్వాదేశాలకు లొంగిపోయిందని విమర్శించారు. గతంలో వ్యతిరేకించిన మీటర్లనే కొనసాగించడం వాగ్దాన భంగమే అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్, సిపిఎం జిల్లా నాయకులు బి.మనోహర్, ఐ.ఎన్.సుబ్బమ్మ, శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు సావంత్ సుధాకర్, భాగ్యమ్మ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.శివకుమార్, నగర నాయకులు ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు : కలెక్టర్

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్,

ప్రజాశక్తి -కడప

మాదక ద్రవ్యాల నిర్మూలనకు పకడ్బందీ కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబరు 9 నుండి 23 వరకు నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) హాలులో ఎన్‌జిఒలు ప్రచురించిన మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల పోస్టర్‌లను కలెక్టర్ శివశంకర్ ఆవిష్కరించి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం వల్ల కలుగు అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడంపై స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువును నిర్లక్ష్యం చేస్తూ విద్యను. కోల్పోతూన్నారన్నారు. మత్తు పదార్థాలను సరఫరా చేసేవారు కానీ, వాటికి అలవాటు పడిన వారు కానీ అసాంఘిక అలవాట్లను ప్రేరేపించే వారుగా, కారకులుగా శిక్షార్హులేనని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిరోధానికి భారత ప్రభుత్వం నార్కోటిక్స్, డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్జె న్సస్ చట్టాలను తీసుకువచ్చిందన్నారు. మత్తు పదార్థాలకు బానిసలవ్వకుండా మంచు నడవడిక, నైతిక విలువలు పెంపొందించుకుని మంచి పౌరులుగా ఎదగాలని యువతకు, విద్యార్థులకు కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర అధికారి మణికంఠ, జూటూరు విజయ్ కుమార్, వసంత్, సూలం లక్ష్మీదేవి, శివశంకర్, అశోక్, సాయి, సరస్వతి, సుబ్బయ్య, ఎన్.వై.కె. వాలంటీర్స్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలో గృహ నిర్మాణ పనులు వందరోజుల లోపల ప్రణాళిక వేసుకుని వేగవంతం చేయాలని ఎంపిడిఒ మహబూబ్‌బి తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన అన్ని గ్రామ పంచాయతీల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గృహ నిర్మాణ పనుల గురించి చర్చించారు. 2019 నుండి ఇప్పటి వరకు చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయని, ఏస్థాయిలో ఉన్నాయో తెలియచేయాలని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం ప్రతి పేదవాడికి ఇల్లు కట్టించాలని సంకల్పంతో ఉందన్నారు. మండలంలో సర్వే చేయాలని తెలిపారు. కార్యక్రమంలో చెన్నుపల్లె, రామాపురం, తెల్లపాడు, పిడుగుపల్లె, చింతలపల్లె, మహానందిపల్లె లింగారెడ్డిపల్లె ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సుజిత్ విక్రమ్ శర్మ, యశ్వంత్ సాయి, సయ్యద్ బాషా, రమేష్, సుజిత, నాగేంద్ర, మేఘన పాల్గొన్నారు.

టిడిపి నాయకులపై చర్యలు తీసుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి - కడప

కడప నగర మేయర్ సురేష్ బాబు ఇంటి ముందు చెత్త వేసి రభస చేసిన టిడిపి నాయకులపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం వైసిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అమర్నాథ్‌రెడ్డి, దాసరి సుధా, నగర మేయర్ సురేష్ బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఎస్పీ హర్షవర్ధన్ రాజును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప చరిత్రలో ఇలాంటి ఘటన ఎప్పుడు చోటు చేసుకోలేదన్నారు. స్థానిక సంస్థల్లో నిధులు లేనప్పుడు దాన్ని నడపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. సురేష్ బాబు ఇంటి ముందు చెత్త వేసిన టిడిపి కార్యకర్తలపై, వారిని ప్రోత్సహించిన టిడిపి నాయకులపై తక్షణం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య, మాజీ సోషల్ వెల్ఫేర్ చైర్మన్ సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, రెడ్డి ప్రసాద్, కిరణ్, కె.బాబు, త్యాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్, పాల్గొన్నారు.

వీణా అజయ్ కుమార్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రముఖ న్యాయవాది స్వర్గీయ వీణా అజయ్ కుమార్ సేవలు మరువలేనివని, సంఘసేవకై ఆయనెప్పుడూ తపించేవాడని డిఆర్‌డిఎ అదనపు పథక సంచాలకులు ప్రసాద్ తెలిపారు. వీణా అజయ్ కుమార్ 63వ జయంతోత్సవాలను ఆయన కుటుంబ సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సామాజిక సేవా కార్యమాలను నిర్వహించారు. కడప నగరంలోని భవిత మానసిక వికలాంగుల ఆశ్రమంలో ఏర్పాటు చేసిన అన్నదాన చేశారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త అమర్, వీణా అజయ్ కుమార్ కుటుంబ సభ్యులు, ఆయన మిత్రులు, అభిమానులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు భోజనం అందజేత

ప్రజాశక్తి - కడప

కలెక్టరేట్ సమీపంలో ఉన్న నిరాశ్రయులకు భోజనం, వాటర్ బాటిళ్లు, పండ్లను బుధవారం ఎస్పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పైడిపల్లి కిషోర్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక మంది కడప పట్టణ పరిసరాలలో తిరుగుతున్న వారికి ఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు ఇలా ప్రతి ఒక్కరూ సేవా మార్గం ద్వారా ముందుకు వెళ్లాలని కోరారు. ఎస్పీఎఫ్ ద్వారా కొంతమంది ఆకలి బాధను తీర్చగలిగామనే తృప్తి ఉందని ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎస్పీఎఫ్ ఎప్పటికీ చేస్తూనే ఉంటుందని పైడిపల్లి తెలియజేశారు కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షులు ముత్తన సుధాకర్ బాబు పాల్గొన్నారు.

ఊరేగింపులో ఘర్షణ పడుతున్న రెండు గ్రూపులు

ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో ఘర్షణ

ప్రజాశక్తి-చెన్నూరు

స్థానిక ట్రంకు రోడ్డులోని జరుగుతున్న శ్రీ లలితా అంబికా నాగేశ్వర స్వామి ఆలయ నిర్వాహకులు బుధవారం ఉత్సవ విగ్రహాలు ఊరేగిస్తుండగా సందర్భంగా రెండు గ్రూపుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. శివాలయం ఎదురుగా మసీదు ఉండడంతో ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు సందర్భంగా ఒక గ్రూపు వ్యతిరేకించడంతో ఘర్షణ నెలకొంది. రెండు గ్రూపులు అధిక సంఖ్యలో మోహరించడంతో సిఐ పురుషోత్తమ రాజు వారితో చర్చలు జరిపారు. ఈ విషయంపై అధికారులకు తెలపడంతో అడిషనల్ ఎస్‌పి వెంకట రాముడుతోపాటు పోలీసు బలగాలు చెన్నూరుకి వచ్చారు. ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు అనంతరం మరో దారి ద్వారా శివాలయం చేరుకున్నాయి. ముందు ముందు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా రెండు గ్రూపులు చెందిన పెద్దలు పిలిపించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో చర్చలు జరిపారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎఎస్‌పి తెలిపారు.

నరసాపురం పిహెచ్‌సిలో టాస్క్‌ఫోర్స్ తనిఖీ

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నర్సాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఈ కేంద్ర పరిధిలో ఉన్న కొండ్రారాజుపల్లె సచివాలయాన్ని బుధవారం టాస్క్ ఫోర్స్ టీం తనిఖీ చేసింది. అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చి రికార్డులు కూడా పరిశీలించారు. గర్భిణులకు బిపి, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి వారికి సలహాలు ఇచ్చారు. అనంతరం అక్కడ ఉన్న సిబ్బందితో వచ్చిన ఎస్ఒ రమేష్ రెడ్డి కలసపాడు, నర్సాపురం ఆరోగ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పారామీటర్ రివ్యూ చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఒ పి.జాకబ్, డిఇఒ నారాయణ, డిపిహెచ్ఎన్ రాజశేఖర్, వైద్యాధికారులు ప్రశాంతి, జయరాములు, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

ఎమ్మెల్సీ చొరవతో రోడ్డు పనులకు నిధులు

ప్రజాశక్తి - వేంపల్లె

సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ

వేంపల్లె గ్రామంలో నిలిచి పోయిన రోడ్డు పనులు మళ్లీ ప్రారంభించేందుకు ప్రభుత్వం రూ.7కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆ మేరకు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి చొరవ చూపారని బుధవారం టిడిపి నేత జివి రమణ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్ర బాబును ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాం గోపాల్ రెడ్డి కలిసి వేంపల్లెలో అసం పూర్తిగా నిలిచిపోయిన రోడ్డు, మురుగు కాలువ పనుల గురించి వివరించారన్నారు. రోడ్డు పనులు మధ్యలో నిలిచి పోవడంతో ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు, వ్యాపారులు చాలా ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్‌కు పాత బకాయిలను చెల్లించేందుకు రూ.7 కోట్లు మంజూరు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. నిధులు మం జూరు చేసినట్లు చెప్పారు. చేసిన పనులకు పాత బకాయిలు మంజూరు కావ డంతో కాంట్రాక్టర్ మళ్లీ పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలి పారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులకు సిఎం నిధులు మంజూరు చేయ డంతో పనులు పూర్తవుతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మం జూరుకు ఎమ్మెల్సీ కృషి చేయడం సంతోషకరమని పలువురు పేర్కొంటున్నారు.

చెరువులకు జలకళ

ప్రజాశక్తి - చాపాడు

పూర్తిగా నిండిన ఖాదర్‌పల్లె చెరువు

మండల పరిధిలోని ఖాదర్‌పల్లె, నాగులపల్లె, పల్లవోలు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. చెరువుల్లోకి నీరు చేరడంతో అవి నిండుగా దర్శనమిస్తున్నాయి. ఆయా చెరువులకు కెసి కెనాల్ అనుబంధ కాలువలు ఉన్నాయి. దీంతో అధికారులు చెరువులకు నీటిని విడుదల చేశారు. మూడు చెరువులు నీటితో పూర్తిగా నిండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమ గ్నమయ్యారు. ఈ చెరువుల కింద సుమారు మూడు వేల ఎకరాల్లో వరి పంట సాగవుతుంది. ప్రస్తుతం ఖాదర్‌పల్లె, నాగులపల్లె, పల్లవోలు గ్రామాల పరిధిలో కొందరు వరి నార్లు పోస్తుండగా.. మరి కొందరు వరి నాట్లు వేస్తున్నారు.

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - దువ్వూరు

ఖరీఫ్ సీజన్ రైతులు సాగు చేసిన పంట వివరాలను తప్పక నమోదు చేయించుకోవాలని ఎఒ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. బుధవార ఆయన మాట్లాడుతూ ఆయా రైతు సేవా కేంద్రాల్లో రైతులు పంట నమోదు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 15వరకు నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. రైతులు తమ రైతు ఆధార్ కార్డు జిరాక్స్, 1బి, బ్యాంక్ ఖాతా, రైతు మొబైల్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన కోరారు.

పశువుల యజమానులకు ఎముకల పొడి పంపిణీ

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని బలక్కవారిపల్లెలో బుధవారం పశువులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డిఎల్‌డిఎ డిప్యూటీ డైరెక్టర్ సురేష్, శివ రామిరెడ్డి పశువులకు వైద్య సేవలు అందించారు. దాదాపు 35 పశువులకు, 86 జీవాలకు నట్టల నివారణ, 35 పశువులకు ఉచితంగా ఎముకల పొడి పంపిణీ చేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రబల్లి సర్పంచు మదార్ బి, దువ్వూరు పశువైద్యాధికారి ఫణీంద్రారెడ్డి, రవీంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - వేముల

మండలంలోని గొందిపల్లె పంచాయతీ రంగోరిపల్లెలో నూతనంగా నిర్మించిన సీతారాముల విగ్రహాల ప్రతిష్టాపనలో భాగంగా బుధవారం సీతారామలక్ష్మణ, ఆంజనేయుడి విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. విగ్రహాలను ఊరేగింపు చేశారు. మూడురోజులపాటు నిత్య అన్నదానం చేశారు. చుట్టూపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్కభజన, కోలాటం ఆకట్టుకున్నాయి.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-కడప సిటీ

కడప నగరంలో ముత్రాసుపల్లెకు చెందిన సాయమ్మ(60) అనే వృద్ధురాలు అనారోగ్యంతో కమలాపురంలో మృతి చెందింది. ఆమెను కడప రిమ్స్ మార్చురీలో ఉంచారు. భర్త, పిల్లలు, ఎవరూ లేనందున అంత్యక్రియలు చేయమని కమలాపురం పోలీసులు వరుసకు చెల్లెలు అయిన ధనలక్ష్మి ఆమెను ఆత్మబంధువుగా భావించి, మేము సైతం సేవా సంస్థ ఆధ్వర్యంలో హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో కె.అయ్య వారయ్య, రామరాజు, శివరాం, నరసింహ, నాగేశ్వరరావు, పుల్లయ్య, గురువయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మూడు కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నాగులకట్టకు వెళ్లే దారిలో గంజాయిని అమ్ముతున్న వ్యక్తులను అరెస్టు చేశామని అర్బన్ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు తమకు వచ్చిన సమాచారాన్ని పరిశీలించామన్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి పట్టణానికి చెందిన యాదగిరి వంశీకృష్ణ అనే వ్యక్తి గంజాయికి బానిస కావడమే కాక.. ప్రొద్దుటూరు, జమ్మలమడుగుకు చెందిన వ్యక్తులకు అమ్ముతూ పట్టుబడ్డాడన్నారు. గంజాయి పట్టివేత కేసులో ఏడు మంది మేజర్లు, ముగ్గురు మైనర్లు ఉండడం బాధాకరమన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలన్నారు. పిల్లలు కళాశాలకు వెళుతున్నారా లేదా అనే విషయాన్ని వారంలో కనీసం ఒక్క రోజైనా కళాశాలకు వెళ్లి అటెండెన్స్ చూడాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ ప్రజలను కోరారు. తమ విలువైన భవిష్యత్‌ను అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్ఐలు కల్పన, రామకృష్ణ, ఎఎస్ఐ మురళి యాదవ్, కానిస్టేబుల్స్ రియాజ్, సురేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ లింగప్ప

అధ్వానం.. రాజకోట మార్గం

దెబ్బతిన్న తారు రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి నుంచి మండల పరిధిలోని రాజకోట గ్రామానికి వేసిన తారు రోడ్డు కొంత కాలానికే అధ్వానంగా తయారైంది. ఏటూరు కాలువ వెంబడి ఎన్నో ఏళ్లుగా గ్రావెల్ రోడ్‌పై ప్రయాణం సాగిస్తున్న గ్రామస్తుల అభ్యర్థన మేరకు గత ప్రభుత్వ హయాంలో రోడ్డును ఉపాధి హామీ అనుసంధానంతో తారురోడ్డు నిర్మించారు. అయితే రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు ఏమాత్రం పాటించకపోవడంతో రెండవ ఏడాది తిరగకుండానే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని గ్రావెల్ బయట పడింది. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో రోడ్డు నిర్మాణ పనులను సరిగ్గా పర్యవేక్షణలేకనే రోడ్డు పరిస్థితి ఈ విధంగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రూ.30 లక్షలకుపైగా ఖర్చు చేసి నిర్మించిన రోడ్డు ఏడాది కూడా నిలువలేకపోయింది. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని మళ్లీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మార్గాన రాజకోటతోపాటు విజయనగరం, ఓబుల్‌రెడ్డి పేట, గాంధీనగరం గ్రామాల ప్రజలు మైదుకూరు, చాపాడు, ప్రొద్దుటూరుకు రావాల్సి ఉంటుం. ఎలాంటి వాహనాలు కూడా ఈ మార్గాన ప్రయాణానికి అందుబాటులో ఉండవు. ప్రజలు స్వచ్ఛందంగా ఆటోలను, ద్వి చక్రవాహనాన్ని కలిగి ఉండి ఈ మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా ఈ ప్రాంత గ్రామ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని దెబ్బ తిన్న రోడ్డు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పుట్టగొడుగుల్లా ప్రయివేట్ వైద్యశాలలు

పట్టని వైద్య శాఖ ఉన్నతాధికారులు - అర్హత లేకున్నా వైద్యం చేస్తున్న ఆర్ఎంపిలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేటలో ప్రయివేట్ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతోంది. అర్హతలేకున్నా ఆర్ఎంపి వైద్యులుగా చెలామణి అవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే వైద్య వృత్తిని కొనసాగిస్తున్నారు. ప్రయివేట్ ఆస్ప త్రులపై తనిఖీలు నిర్వహించాల్సిన వైద్యశాఖ ఉన్నతాధికారులు పత్తా లేరని, మామూళ్ల మత్తులో ఉండిపోతున్నారనే ఆరోపణలున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రయివేట్ క్లినిక్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఖాజీపేట పట్టణంలో వాడవాడలా ప్రయివేట్ క్లినిక్‌లు వెలసి ఉన్నాయి. ఇంటిని అద్దెకు తీసుకొని క్లినిక్‌ల పేరుతో బోర్డులు ఏర్పాటు చేసుకుని వైద్యం చేస్తు న్నారు. రోగులకు మంచినీరు, మరుగుదొడ్లు, మంచాలు వంటి కనీస సదు పాయాలు కూడా లేవు. నివాసాలు ఉండే ఇళ్లను సైతం అద్దెకు తీసుకొని పలువురు ప్రయివేట్ ఆస్పత్రులను కొనసాగిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. చిన్నపాటి జ్వరం వస్తే ప్రయివేట్ ఆసుపత్రికి వెళితే పరీక్షల పేరుతో దోపిడీకి గురి చేస్తున్నారని, ఏమాత్రం నయం కాకపోయినా వేలకు వేలు ఖర్చు అవుతోందని బాధితులు ఆవే దన వ్యక్తం చేస్తు న్నారు. అర్హత లేని సిబ్బంది కూడా ప్రయివేట్ డాక్టర్లుగా చెలామణి అవుతూ వైద్య సేవలు కొన సాగిస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతా ధికారులు ఎలాంటి చర్యలు తీసు కోవడం లేదని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జ్వరాల పేరిట రకరకాల రక్త పరీక్షలు చేస్తూ.. వేల రూ పాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని వాపో తున్నారు. డిఎం హెచ్ఒ కార్యాలయ అధికారులు ప్రయివేట్ క్లినిక్‌ల యజమానులకు వతాసు పలుకు తున్నారని, వారి పట్ల చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇటీవల ఖాజీ పేట పట్టణంలో ప్రయివేట్ క్లినికల్‌లు అధిక మ య్యాయని, అందరూ ఒక్కటై భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని తీవ్ర ఆరోపణలున్నాయి. మెడికల్ షాపులు, ల్యాబ్‌లు అన్నీ తామై నడిపిస్తూ అధిక మొత్తంలో సొమ్ము చేసు ంటున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పం దించి తనిఖీలు నిర్వహించి.. అనుమతుల్లేని, కనీ సం వసతుల్లేకుండా నిర్వహిస్తున్న ప్రయివేట్ క్లిని క్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సి.ఆది నారాయణరెడ్డి

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ బాలికల కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాలకు సంబంధించి పక్కనే హాస్టల్ కూడా ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు మధ్యలో చదువు ఆపకుండా చూసేందుకే వసతిగృహాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దూర ప్రాంతాల విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా విద్యను అభ్యసించాలన్నారు. తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకొచ్చేలా చదవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాల భూపేష్ సుబ్బరామిరెడ్డి, జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కమిషనర్ ప్రమోద్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు .

నిజాలు తెలుసుకొని ఆరోపణలు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గడచిన కొద్దిరోజులుగా ప్రొద్దుటూరులో నిర్మాణం చేపట్టిన అక్రమ కట్టడాలపై టిడిపి, వైసిపి నాయకులు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్న నేపథ్యంలో.. సూపర్ బజార్ రోడ్డు మొదలులో నూతనంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపణలు చేశారు. ఇందుకు వైసిపి కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి ప్రత్యారోపణలు చేశారు. మీ హయాంలో అంటే.. మీ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా పర్మిషన్ ఇచ్చారని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా టిడిపి నేత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కౌన్సిలర్ లక్ష్మీదేవి నిజాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. బుధవారం నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కౌన్సిలర్ గరిశపాటి చేసిన ఆరోపణలకు గట్టిగా సమాధానమిచ్చారు. వైసిపి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే పట్టణ వ్యాప్తంగా నిర్మాణం అవుతున్న అక్రమ కట్టడాలను తొలగించవలసిందిగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు చెన్నయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నేత ఇవి సుధాకర్‌రెడ్డి

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే తగిన చర్యలు తీసు కుంటామని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి డీలర్లను హెచ్చ రించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన ఆక స్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, గోడౌన్ లోని స్టాక్ నిల్వలను పరిశీలించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ డీలర్లు అమ్మిన ఎరువు బస్తాలను డిబిటిలో రైతు ఆధార్ నెంబరు నమోదు చేయా లని సూచించారు. యూరియాను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుని లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. డీలర్లు యూరియా కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. అమ్మిన ప్రతి బస్తాకు రైతుకు నగదు రసీదు ఇవ్వాలన్నారు. లైసెన్సు కనపడేలా దుకాణంలో ఉంచాలని డీలర్లుకు సూచించారు. రైతులకు కావలసిన యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, పోటాష్ ఎరువులు, భాస్వరం ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నూనె పంటల సాగు, ఉత్పత్తిని ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

పలుగురాళ్లపల్లె రైతు సేవ కేంద్రం పరిధిలో బుధవారం నూనెలపై దిగుమతి భారం తగ్గించుకొనుటకు, దేశీయంగా నూనె పంటల సాగు, ఉత్పత్తిని ప్రోత్సహించాలని ఉద్యానశాఖ, ఆయిల్ పామ్ కంపెనీ సువేన ఆగ్రో ఇండిస్ట్రీస్ సంయుక్తంగా 'ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఉద్యానశాఖాధికారి శ్రీని వాసులరెడ్డి మాట్లాడుతూ రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్స హించడానికి చేపట్టవలసిన కార్యక్రమాలను రైతులతో చర్చించడం, సాగులో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులను, ప్రభుత్వం ద్వారా రైతులకి అందిస్తున్న ఆర్థిక రాయితీల వివరాలు, క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్ర సహాయకులు ఓబులేసు, కంపెనీ ప్రతినిధులు కొండారెడ్డి, డ్రిప్ ఏరియా అధికారి జయసుబ్బారెడ్డి, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు నారాయణ, పెంచలయ్య, రైతులు రాజేశ్వర్ రెడ్డి, నాగిరెడ్డి, దుగ్గి రెడ్డి, రమణారెడ్డి, సత్య నారాయణరెడ్డి పాల్గొన్నారు.

1న ప్రొద్దుటూరులో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సెప్టెంబర్1న ప్రొద్దుటూరులో జిల్లాస్థాయి అండర్-18, 20, 23 పురుష, మహిళలకు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్‌బాషా, జిల్లా అథ్లెటిక్స్ అసోషియేషన్ అధ్యక్షులు బసిరెడ్డి వీరకళ్యాణ్‌రెడ్డి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్థానిక అనిబిసెంట్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశామన్నారు. 100మీ, 200మీ, 400మీ, 1000మీ, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో వంటి క్రీడల్లో పోటీలుంటాయన్నారు.ఇందులో కడప జిల్లా వారెవరైనా పాల్గొనవచ్చన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరచిన వారిని సెప్టెంర్14, 15, 16తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో నిర్వహించే స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు ఎంపిక చేస్తామన్నారు. ఇందులో 16 ఏళ్లు నిండినవారు మాత్రమే పాల్గొనాల్సి ఉంటుందన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. వివరాలకు 99496 86586 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

అనారోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం : పిసిసి

మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

టిడిపి కూటమి పాలనలో రాష్ట్రం అనారోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తయారైందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాయలంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మొన్నటి వరకు రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులు డయేరియా రోగులతో కిటకిట లాడేవని, ప్రస్తుతం విషజ్వరాలతో నిండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మలేరియా కేసుల నమోదు 2022లో 1,237, 2023లో 3,480 కాగా.. 2024 ఆగష్టు 25 నాటికి 4,610 నమోదయ్యాయన్నారు. డెంగీ కేసులు 2022లో 2,174, 2023లో 3,252 నమోదు అయ్యాయని, 2024 ఆగష్టు 25 నాటికి 2,955 నమోద య్యాయన్నారు. చికెన్ గున్యా కేసులు 2022లో 16, 2023లో 5 నమోదుకాగా, 2024 ఆగష్టు 25 నాటికి 99 కావడం గమనార్హమ న్నారు. రాష్ట్రంలో పారిశుధ్యం పడకేసిందని, దాని పర్యవసానంగా రోగాలు ప్రబలుతున్నాయన్నారు. ఇప్పటికైనా పారిశుధ్యంపై, ప్రజారోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని తులసిరెడ్డి సూచించారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జీలానిబాషా, రామాం జనేయులు, రషీద్, ఖలందర్, ఖాజా, అలీ, గయాజ్, అమర్, ఉత్తన్న, సుబ్బరాయుడు, వినయ్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE : KADAPA

O.S.No. 633/2019

Andhra Pragathi Grameena Bank, Represented by its Branch Manager, Ramanapalli Branch, Kadapa.

......Plaintiff

And

Sri Bhavana SHG, Chinnamasupalli, Rep. by its 1st and 2nd leader(D1 and D2).

3).Davanam Suseela, wife of prakasam, aged about 40 years,

4).Lanka Sri Devi, wife of pullaiah, aged about 35 years,

6). Davanam Rojamma, wife of Kanakaraju, aged about 50 years, R/at C.M. Palli, Chennur Mandal, Kadapa District.

...Defendants

NOTICE TO DEFENDANT NO's 3, 4 and 6.

Whereas the above Plaintiff filed the suit against the defendants for recovery of the amount due under loan and the said suit stands posted to 30/08/ 2024 at 10.30AM for defendants No.3,4 and 6 appearance. If the defendant No. 3,4 and 6 fails to appear the matter will be decided Ex-Parte.

K. KRISHNA MURTHY
B.A., B.L.,
Advocate for the Plaintiff
KADAPA. Cell :8008229351.

చికెన్ సెంటర్‌లో తూనికలను పరిశీలిస్తున్న అధికారి ఎం.రమేష్‌కుమార్‌రెడ్డి

వ్యాపారులు నిబంధనలు విధిగా పాటించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వ్యాపారులు నిబంధనలను విధిగా పాటించాలని తూనికలు, కొలతల శాక అధికారి ఎం.రమేష్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలో బుధవారం వివిధ ప్రాంతాల్లో తూనికలు, కొలతల అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక దుకాణాల్లో 25 కిలోల బియ్యం బస్తాకు ఒక కిలో రెండు కిలోలు తక్కువగా ఉండడం, కాలపరిమితి ముగిసిన దాదాపు పది దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యాపారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిర్ణీత కాలపరిమితి పూర్తయిన వెంటనే తిరిగి కాటాలకు అనుమతి తీసుకోవడం, తూకం రాళ్లకు ముద్రలు వేయించుకోవడం చేయాలని ఆదేశించారు. ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పట్టణ పరిశుభ్రతకు సహకరించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పరిశుభ్రతకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి కోరారు. పలు వార్డుల్లో బుధవారం ఆయన అధికారులతో కలిసి జెండామాను ప్రాంతంలో పర్యటించారు. అక్కడి ప్రజలతో మంచి నీటి సరఫరా, వీధి లైట్ల నిర్వహణ, తడిచెత్త పొడిచెత్త సేకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి నెంబరు విధిగా ఉండేలా సచివాలయం సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ కుళాయి కనెక్షన్లను గుర్తించి, వాటిని రెగ్యులర్ చేయించాలని వార్డు అమెనిటీ సెక్రటరిలకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి మునికుమార్, ఆర్ఐ మధుసూదన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూసేసి ఉన్న వేముల వ్యవసాయ కార్యాలయం

తెరచుకోని వ్యవసాయ కార్యాలయం

అందుబాటులోకిరాని అధికారి - రైతులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయం తలుపులు తెరచుకోవడం లేదు. అలాగే రైతులకు మండల వ్యవసాయ అధికారి అందుబాటులోకి రాకపోవడంతో రైతులకు తిప్పలు తప్పడంలేదు. కార్యాలయం వద్దకు రైతులు కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ ఆధికారిని కలవడానికి వెళితే కార్యాలయం మూసే ఉంటుందని వాపోతున్నారు. ఫోన్ చేస్తే అప్పుడు, ఇప్పుడొస్తానని చెప్పి తప్పిచుకొంటున్నారని రైతులు తెలి పారు. వ్యవసాయ కార్యా లయానికి బీగాలు వేసి ఉండడంతో రైతులు నిరాశతో వెను దిరుగు తున్నారు. ఉల్లి పంటకు తెగుళ్ల ఆశించడంతో దాని నివారణకు సలహాలు ఇవ్వడం లేదని రైతులు అంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో అధిక పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేసి నష్టపోవాల్సిన పరిస్థితి వస్తున్నట్లు తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL, ARB.NO. 631 of 2024

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., **NAKKALAGUTTA CAO** Branch, R/o.WARANGAL.

... Disputant

A N D

Mr NAGAIAH KAPPALA **,& others**

... Opponents

1. Mr.NAGAIAH KAPPALA, S/O K PEDDA KONDAIAH, AGED ABOUT : 49 YEARS, OCC : D.NO.1-219, RAGIMANUPALLE, KADAPA-516390, PULIVENDULA, KADAPA, Y.S.R. (CUDDAPAH), ANDHRA PRADESH, INDIA - 516390

2. RAMA MOHAN REDDY LAVANOORU , S/O JAYA RAMI REDDY, AGED ABOUT :47 YEARS OCC:HELPER ,H.NO.1-9-29A, MABBUCHINTALA PALLI , KADAPA, Y.S.R. (CUDDAPAH), ANDHRA PRADESH,INDIA – 516349

3.MRS.JANARDAN AKULA , S/O RAMULU, AGED ABOUT :40 YEARS ,OCC: HELPER H.NO. 1/106,KANAMKINDA KOTTALU VELPULA, CUDDAPAH, Y.S.R. (CUDDAPAH), ANDHRA PRADESH, INDIA -516349

4. GANGA RAJU CHITTI BOINA , S/O GANGANNA, AGED ABOUT :43 YEARS , OCC: HELPER H.NO.3/ 20A, M TUMMALAPALLI MABBUCHINTALAPALLE, CUDDAPAH , Y.S.R. (CUDDAPAH),ANDHRA PRADESH, INDIA – 516349

5. VASUDEVA REDDY SAGILI , S/O RAMA CHANDRAREDDY,AGED ABOUT :32 YEARS ,OCC: HELPER ,H.NO.4/17-A, BHUMAYYAGARI PALLI MEEDIPENTLA, CUDDAPAH, Y.S.R. (CUDDAPAH), ANDHRA PRADESH, INDIA – 516349

6. NAGARAJU AKULA, S/O RAMULU, AGED ABOUT :45 YEARS ,OCC: HELPER ,H.NO.1/8, KANAMKINDA KOTTALA VELPULA, CUDDAPAH, Y.S.R. (CUDDAPAH), ANDHRA PRADESH, INDIA-516349

10. SUJATHA KAPPALA , W/O. K. NAGAIAH, AGED ABOUT :46 YEARS ,OCC: HOUSE WIFE D.NO.1- 219,RAGIMANUPALLE,KADAPA-516390,PULIVENDULA,KADAPA,Y.S.R(CUDDAPAH), ANDHRA PRADESH, INDIA – 516390.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **13-09-2024** for your appearance. On that day you have to appear in person at 11.00 A.M. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION WARANGAL,